సాక్షి కర్నూలు

శనివారం ; 27 ; మే ; 2023



'కానుక' సిద్ధం

శిరివెళ్ల: పాఠశాలల పునః ప్రారంభం రోజే జగనన్న విద్యా కానుక పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విడతల వారీగా వస్తున్న కానుకలను పాఠశాలల్లో నిల్వ చేస్తున్నారు.



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



.. కల నెరవేరుతున్న వేళ

డోన్ ఫోర్ కోర్టు భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 23.50 కోట్లు మంజూరు చేసింది. న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

10లో▸

న్యూస్‌రీల్

కర్నూలు శివారులో ఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం

కర్నూలు(రాజ్‌విహార్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) ప్రధాన కార్యాలయాన్ని కర్నూలు శివారులోని ఏపీ కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న ట్రాన్స్‌కో సబ్ స్టేషన్‌లో నిర్మించనున్నారు. ఈ సబ్ స్టేషన్‌ను ఆరు ఎకరాల్లో ఏర్పాటు చేయగా.. ఇందులోని రెండు ఎకరాల స్థలం తీసుకొని ఈఆర్‌సీ కార్యాలయ భవనాలు నిర్మించనున్నారు. 2014లో రాష్ట్ర విభజన జరిగినా ఇప్పటి వరకు ఏపీ ఈఆర్‌సీ (విద్యుత్ నియంత్రణ మండలి) ప్రధాన కార్యాలయం హైదరాబాదులోనే ఉంది. ఈ కార్యాలయాన్ని కర్నూలుకు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఏప్రిల్ 25న ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ జీఓ ఎంఎస్ నంబర్–8ని విడుదల చేసిన విషయం తెలిసిందే. శాశ్వత భవనం ఏర్పాటు చేసే వరకు తాత్కాలిక భవనం కోసం అధికారులు అన్వేషిస్తున్నట్లు సమాచారం. అయితే ఇది ఇంకా ఉన్నతాధికారులు పరిధిలోనే ఉందని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణకుమార్ పేర్కొన్నారు. ఈఆర్‌సీ కార్యాలయం ఇక్కడికి వచ్చాక కమిషన్‌తో పాటు సభ్యులు, అధికారులు రానున్నారు.

యాంత్రీకరణతో ఎన్నో ప్రయోజనాలు

- కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన



అయిల్ ఇంజిన్లు, పైపులు అందుకున్న రైతులతో జిల్లా కలెక్టర్ సృజన

ఎమ్మిగనూరురూరల్: వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అన్నారు. శుక్రవారం కందనాతి గ్రామంలో ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన ఆధ్వర్యంలో మైక్రో వాటర్ షెడ్ కింద కందనాతి, కడివెళ్ల రైతులకు రూ.1.80 కోట్లు విలువ చేసే వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు ఫాంపాండ్స్ తవ్వుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులను మహిళలే ముందుండి నడిపిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 500 సర్వీసులను అందిస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, అడిషనల్ పీడీ సలీంబాషా, విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి, తహసీల్దార్ జయన్న తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో బదిలీలకు కౌన్సెలింగ్

కర్నూలు(రాజ్‌విహార్): స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో శుక్రవారం బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక సీ.క్యాంప్ వద్దనున్న ఆర్‌జేడీ కార్యాలయంలో ఈ ప్రక్రియ చేపట్టారు. ప్రాజెక్టుల మార్పు, కొత్త వాటి ఏర్పాటులో భాగంగా ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్న 84 మంది సూపర్‌వైజర్లు గ్రేడ్–1, గ్రేడ్–2, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, డ్రైవర్లు 20 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ తెలిపారు. ఈ నెలాఖరులోగా ఉత్తర్వులు ఇస్తామన్నారు.

శ్రీశైలంలో 'విరాటపర్వం పారాయణం'



పూజల్లో పాల్గొన్న ఈఓ లవన్న, పండితులు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణార్థం శ్రీశైల ఆలయంలో మహాభాగవతంలోని విరాటపర్వం పారాయణం కొనసాగుతోంది. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని శుక్రవారం భ్రమరాంబాదేవి ఆలయ ప్రాంగణంలో ఆశీర్వచన మండపంలో ప్రారంభించారు. వేసవితాపం తగ్గి, సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో దేవస్థానం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. తెనాలికి ప్రముఖ సంస్కృత పండితులు శిష్టి లక్ష్మీధరశర్మ, శిష్టి లక్ష్మీ సీతారామాంజనేయశర్మ విరాట పారాయణం చేస్తున్నారు. ముందుగా అర్చకస్వాములు సంకల్పం పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. తరువాత రుత్విగ్వరణంలో ఉభయ దేవాలయాల ప్రధానార్చకులకు, పారాయణ చేయు పండితులకు దేవస్థాన ఈఓ చేతుల మీదుగా నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు వీరయ్యస్వామి, మార్కండేయశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మిట్టసోమాపురం రిజర్వాయర్ నుంచి మృతదేహాన్ని తీసుకొస్తున్న దృశ్యం



నీట మునిగిన నవ్వులు!

రిజర్వాయర్‌లో మునిగి ముగ్గురి మృతి

- బాలుడిని కాపాడబోయి ఒకరి తర్వాత ఒకరు
- లోతు తెలియక, ఈత రాక మృత్యువాత
- చీరల సాయంతో ఇరువురిని కాపాడిన బాలికలు
- పెళ్లింట అలుముకున్న విషాదం



మృతులు మరియమ్మ, లక్కీ(ఫైల్)

ఓ చిన్నారి రిజర్వాయర్‌లో పడిపోయాడు. కాపాడేందుకు వెళ్లిన మేనత్త నీట మునిగింది. పిల్లాడి తల్లి కూడా నీటిలోకి వెళ్లింది. మరో ఇద్దరు మహిళలు తమ వంతు ప్రయత్నం చేయబోయి రిజర్వాయర్‌లోకి దూకారు. వీరందరికీ ఈత రాకపోయినా.. ఒక్క ప్రాణాన్ని కాపాడేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టారు. లోతు తెలియక నీటిలోకి దిగడంతో ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరయ్యారు. ఒడ్డున ఉన్న ఇద్దరు పిల్లలు, మరో మహిళ దిక్కుతోచక గట్టిగా కేకలు వేస్తూ రోదించారు. ఇదే సమయంలో కలిగిన సమయస్ఫూర్తితో ఆ ఇద్దరు పిల్లలు తమతో పాటు తెచ్చుకున్న చీరలను చెరువులోకి విసిరారు. ఆ ప్రయత్నం వృథా పోలేదు.. నీటిలో మునిగితేలుతున్న ఇద్దరు మహిళలు వాటిని పట్టుకోగా.. ఒడ్డున ఉన్న మరో మహిళ సాయంతో బయటకు లాక్కొచ్చారు. అలా చూస్తుండగానే మరో మూడు ప్రాణాలు నీటిలో కలిశాయి. ఈ హృదయ విదారక ఘటన మూడు కుటుంబాల్లో విషాదం నింపినా.. ఓ ఆలోచన ఇద్దరు మహిళలకు ప్రాణం పోసింది. అప్పటి వరకు పెళ్లి సంబరంతో విరబూసిన నవ్వులన్నీ కళ్లెదుటే రిజర్వాయర్‌లో కలిసిపోవడం ఊరంతటినీ కలచివేసింది.

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలో గోకారి కుమారుడు బాషాకు గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన బంధువుల అమ్మాయితో గురువారం వివాహం జరిగింది. రెండు రోజుల క్రితమే బంధువులంతా సిరాలదొడ్డి గ్రామానికి వచ్చారు. శుక్రవారం తిరుగు పెళ్లికి పెద్దమర్రివీడుకు వెళ్లాల్సి ఉంది. అయితే గ్రామ సమీపంలో ఉన్న మిట్టసోమాపురం రిజర్వాయర్(ఎంఎస్‌పీ)లో దుస్తులు ఉతికేందుకు పెళ్లి కుమారుడు బాషా బంధువులైన దేవనకొండ మండలం వరిముక్కల గ్రామానికి చెందిన మరియమ్మ, గోనెగండ్ల మండలం చిన్ననెలటూరుకు చెందిన సులోచనమ్మ, హెచ్. కైరవాడికి చెందిన కవితలతో పాటు మొత్తం 8 మంది వెళ్లారు. దుస్తులు శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కవిత కుమారుడు లక్కీ(5) నీటిలో మునిగిపోయాడు. గమనించిన బాలుడు మేనత్త సులోచన కేకలు వేస్తూ నీటితో దూకింది. వెంటనే బాలుడి తల్లి కవిత కూడా దూకింది. వీరిద్దరూ మునిగి పోతుండడంతో ఒడ్డున ఉన్న ఎర్రకోటకు చెందిన సరోజమ్మ, దేవనకొండ మండలం వరిముక్కలకు చెందిన మరియమ్మ కూడా నీటిలోకి దూకారు. సులోచన, మరియమ్మ నీటి మునిగి మృతి చెందగా.. కవిత, సరోజమ్మలను ఒడ్డున ఉన్న బాలికలు చీరలను నీటిలో వేసి కాపాడారు. వీరి ఏడుపులు, కేకలు విని సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న వారు పరుగున వచ్చి నీటిలో దూకి బాలుడు, సులోచనమ్మ, మరియమ్మ మృతదేహాలను బయటకు తీశారు.



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువు

మృతదేహాలకు పోస్టుమార్టం

సిరాలదొడ్డి గ్రామ సమీపంలోని మిట్టసోమాపురం రిజర్వాయర్(ఎంఎస్‌పీ) 18 అడుగుల లోతు ఉంది. ఎండా కాలం కావడంతో రిజర్వాయర్‌లో నీరు మూడు అడుగుల లోతు మాత్రమే ఉన్నాయి. అయితే రిజర్వాయర్‌లోని గుంతల్లో 8 నుంచి 9 అడుగుల వరకు నీరు ఉన్నాయి. మహిళలు గుంతల్లో ఉన్న నీటిలో మునిగి మృతి చెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి, గోనెగండ్ల ఎస్‌ఐ తిమ్మారెడ్డి, రూరల్ ఏఎస్‌ఐ బాలజీనాయక్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల బంధువుల రోదనలతో ప్రభుత్వాసుపత్రి ప్రాంగం శోకసంద్రంగా మారింది. ఆసుపత్రికి ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, రూరల్, టౌన్ సీఐలు మోహన్‌రెడ్డి, మదుసుధన్‌రావు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి విలేకరులకు తెలిపారు.

'తల్లి'డిల్లిన హృదయం

అప్పటి వరకు ముద్దుముద్దు మాటలతో, నవ్వులతో సందడి చేసిన ఒక్కగానొక్క కుమారుడు ఒక్కసారిగా కనిపించక పోయే సరికి తల్లి కవిత తల్లడిల్లింది. రిజర్వాయర్‌లో బిడ్డ గల్లంతయ్యాడని తెలిసి క్షణం కూడా ఆలస్యం చేయకుండా నీటిలోకి దూకింది. ఈత రాకపోయినా కుమారుడిని కాపాడుకోవాలని శతవిధాలా ప్రయత్నించింది. అయితే ఆమె ప్రయత్నం ఫలించలేదు. బిడ్డ విగత జీవిగా మారడంతో తట్టుకోలేకపోయింది. కుమారుడి మృతదేహాన్ని భుజం వేసుకుని రిజర్వాయర్ వద్ద పిచ్చిగా పరుగులు తీసింది. ' నేను మీ అమ్మను.. లేవరా'' అంటూ విలపిస్తుండడం చూపరుల కంటతడిపెట్టించింది.

ప్రాణాలు నిలిపిన సమయస్ఫూర్తి

నీటిలో మునిగిపోతున్న ఇద్దరు మహిళలను భయపడకుండా సమయస్ఫూర్తితో బాలికలు కాపాడారు. హెచ్. కైరవాడికి చెందిన సురేష్, మరియమ్మలకు ముగ్గురు సంతానం కాగా..వారిలో ఆనందమ్మ 8వ తరగతి చదువుతోంది. సిరాలదొడ్డి గోకారి.. సురేష్‌కు బాబాయ్ కావటంతో కుటుంబ సభ్యులు బుధవారం పెళ్లి ఇంటికి వచ్చారు. అలాగే ఎర్రకోటకు చెందిన రామాంజనేయులు, ప్రమీలమ్మల ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కుమార్తె దైవకుమారి 4వ తరగతి చదువుతోంది. రామాంజనేయులుకు గోకారి మామ కావటంతో వీరు కూడా బుధవారం పెళ్లికి వచ్చారు. నీటిలో మునిగినప్పుడు మొదట భయపడినా ధైర్యం తెచ్చుకొని ఆనందమ్మ, దైవకుమారి చీరలు నీటిలోకి వేసి కవిత, సరోజమ్మల ప్రాణాలను మరో మహిళ సాయంతాలో కాపాడారు.



దుస్తులు ఉతికిన ప్రాంతం ఇదే..

పెళ్లింట విషాదం: ముగ్గురి మృతితో పెళ్లింట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పెద్దమర్రివీడులో శుక్రవారం తిరుగు పెళ్లి ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ముగిసింది.

టీచర్ల బదిలీలకు ముగిసిన దరఖాస్తు గడువు

- నేటితో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి
- ఈ నెల 28, 29 తేదీల్లో సీనియారిటీ జాబితాలు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు శుక్రవారంతో ముగిసింది. సాయంత్రం 6 గంటల వరకు మొత్తం 6,902 మంది అన్ని కేడర్ల టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1,759 మంది 8 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారు ఉండగా, వీరందరు కంపల్సరీ బదిలీకి.. 5,143 మంది ఉపాధ్యాయులు రిక్వెస్ట్ దరఖాస్తు చేసుకున్నారు. వీరందరి సర్టిఫికెట్లను ఈనెల 25 నుంచి వెరిఫికేషన్ చేస్తున్నారు. నేటి(శనివారం)తో ఈ ప్రక్రియ ముగయనుంది. ప్రావిజినల్ సీనియారిటీ జాబితాలు ఈనెల 28, 29 తేదీల్లో ప్రదర్శించనున్నారు. జాబితాలపై 30వ తేదీన అభ్యంతరాలను స్వీకరించనున్నారు. వచ్చిన అభ్యంతరాల ఆధారంగా మార్పులు చేర్పులకు ఈనెల 31, జూన్ 1వ తేదీ వరకు అవకాశం కల్పించారు. జూన్ 2, 3 తేదీల్లో తుది సీనియారిటీ జాబితాతో పాటు ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్స్‌ను ప్రదర్శించనున్నారు. వచ్చే నెల 4వ తేదీన ఖాళీల జాబితాను ప్రకటిస్తారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు 5, 6 తేదీల్లోను, స్కూల్ అసిస్టెంట్ టీచర్లు 5, 6, 7, ఎస్‌జీటీ టీచర్లు 5, 6, 7, 8 తేదీల్లో ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశాన్ని కల్పించారు. 9వ తేదీన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ టీచర్లు, ఎస్‌జీటీ టీచర్ల జాబితాలు ప్రకటించనున్నారు.

సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

- కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్

కర్నూలు /పత్తికొండ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశించారు. పత్తికొండ సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో సీఎం బహిరంగ సభ ప్రాంగణాన్ని శుక్రవారం ఎస్పీ కృష్ణకాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో కలసి డీఐజీ పరిశీలించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభకు వచ్చే ముఖ్యమైన రహదారులను, బందోబస్తును పరిశీలించారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు.



భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మెల్యే శ్రీదేవితో చర్చిస్తున్న డీఐజీ సెంథిల్ కుమార్

రేషన్‌లో ఇక రాగులు

- జూన్ నుంచి ప్రతి కార్డుదారుడికి మూడు కేజీల చొప్పున పంపిణీ
- కర్నూలు జిల్లాకు 1,900 క్వింటాళ్ల రాగుల కేటాయింపు
- చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు



కర్నూలు(సెంట్రల్): రేషన్ కార్డుదారులకు అత్యధిక పోషకాలు ఉన్న రాగులను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్ణయించింది. ప్రతికార్డుకు కేజీ నుంచి మూడు కేజీల వరకు బియ్యం స్థానంలో ఉచితంగా రాగులను పంపిణీ చేస్తారు. జూన్ నుంచే ఈ విధానం అమలు కానుంది. జిల్లాలో 6,62,083 రేషన్ కార్డులు ఉన్నాయి. దాదాపు 12 లక్షల మందికిపైగా రేషన్ అందుతోంది. కార్డుకు మూడు కేజీల ప్రకారం రాగులు ఇస్తుండడంతో జిల్లాకు దాదాపు 1,900 టన్నులు కేటాయించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి వీటిని కర్నూలుకు తీసుకొస్తున్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

చిరుధాన్యాల సాగును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిసున్తన్నాయి. అందులో భాగంగా 2022–23 ఆర్థిక సంవత్సరాన్ని చిరుధాన్యాల సాగు సంవత్సరంగా ప్రకటించారు. చిరుధాన్యాలలో రాగులు అత్యధిక పోషకాలు కలిగి ఉన్నాయి. రాయలసీమ జిల్లాలైన తిరుపతి, నంద్యాల, అన్నమయ్య, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ జిల్లాలో రేషన్‌లో రాగుల పంపిణీని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. జూన్ నుంచి ప్రతి రేషన్‌కార్డుకు కేజీ నుంచి మూడు కేజీల వరకు ఉచితంగా బియ్యం స్థానంలో ఇస్తారు. జూన్ నుంచి ఎండీయూ ఆపరేటర్ల ద్వారా బియ్యం, బ్యాళ్లు, చక్కెరతోపాటు రాగులను అందజేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

రాగులతో ప్రయోజనాలు ఇవే..

రాగుల్లో పాస్ఫరస్, ఐరన్, ఫైబర్, కాల్షియం, జింక్ అధికంగా ఉంటాయి. వీటి వినియోగంతో మధుమేహ వ్యాధిని నియంత్రించుకోవచ్చు. ఎముకల దృఢత్వం పెరుగుతుంది. గుండె పనితీరు మెరుగవుతుంది. జీర్ణక్రియ ఉన్నతస్థితికి చేరుతుంది. శారీరక బరువు తగ్గుతుంది. రాగులు శరీరంలో వేడిని తగ్గిస్తాయి. బాలింతల్లో పాల ఉత్పత్తికి ఇవి సహాయపడతాయని వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఎండీయూ ఆపరేటర్ల ద్వారా పొందండి



పేదలకు ఉచితంగా రాగులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జూన్ నుంచి కార్డుకు కేజీ నుంచి మూడు కేజీల చొప్పున రాగులను ఇస్తారు. జిల్లాకు కర్ణాటక రాష్ట్రం నుంచి రాగులు వస్తున్నాయి. వచ్చే నెలలో బియ్యం, బ్యాళ్లు, చక్కెరతోపాటు వీటిని పొందవచ్చు. ఎండీయూ ఆపరేట్ల ద్వారానే రాగులను తీసుకోవాలి. అదనంగా ఎలాంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు.

– ఎస్.మౌర్య, జేసీ, కర్నూలు

నెరవేరుతున్న పదోన్నతుల కల

- పంచాయతీరాజ్ శాఖలో త్వరలో పదోన్నతులు
- అర్హులైన వారి వివరాలను కోరిన పీఆర్ కమిషనరేట్
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతి ?
- ప్రత్యేక ఫార్మెట్‌లో వివరాలు పంపిన జెడ్పీ, డీపీఓ అధికారులు



జిల్లా పరిషత్ కార్యాలయం

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగుల పదోన్నతుల కల నెరవేరుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంపీడీఓ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం అర్హులైన ఏఓ, ఈఓఆర్‌డీల వివరాలను త్వరగా పంపించాలని పీఆర్ కమిషనరేట్ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి ఫార్మెట్‌లో వివరాలను పంపాలని శుక్రవారం ఉదయం జరిగిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీఆర్ అండ్ ఆర్‌డీ అడిషనల్ కమిషనర్ ధూళిపాళ్ల సత్యనారాయణ జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. పదోన్నతులకు సంబంధించిన వివరాలను పీఆర్ కమిషనరేట్ కోరిన నేపథ్యంలో తాజాగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పని చేస్తున్న 13 మంది ఏఓ, 11 మంది ఈఓఆర్‌డీలకు పదోన్నతులు లభించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఫార్మెట్‌లో వివరాలు ...

పదోన్నతులకు సంబంధించి పీఆర్ కమిషనరేట్ పంపిన ఫార్మెట్‌లో పలు వివరాలను కోరారు. ఉద్యోగి పేరు, హోదా, ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా, సొంత జిల్లా, పదోన్నతి లభిస్తే ఏ జిల్లాకు వెళ్లాలనుకుంటున్నారో అనే విషయానికి సంబంధించి మూడు ఆప్షన్లు, స్పౌజ్, మెడికల్ తదితర వివరాలను పంపాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాల్లో ఈ వివరాలను పంపే పనిలో నిమగ్నమయ్యారు.

జిల్లాలో 16 మండలాల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 16 మండలాల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓలు కొనసాగుతున్నారు. కర్నూలు జిల్లాలోని ఆస్పరి, హొళగుంద, తుగ్గలి, కొతాళం, కర్నూలు, పత్తికొండ, కృష్ణగిరి, వెల్దుర్తి, మంత్రాలయం, పెద్దకడబూరు మండలాల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓలు కొనసాగుతున్నారు. అలాగే నంద్యాల జిల్లాలోని దొర్నిపాడు, కొలిమిగుండ్ల, గడివేముల, చాగలమర్రి, పాములపాడు, బనగానపల్లె మండలాలు కూడా ఇన్‌చార్జ్‌ల పాలనలో ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పదోన్నతులు లభించిన వెంటనే అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పదోన్నతులు పొందనున్న వారి వివరాలు..

పదోన్నతులకు సంబంధించి కమిషనరేట్‌కు పంపిన వివరాల్లో ఏఓలు సుధాకర్‌రావు (చిప్పగిరి), దాసానాయక్ (హొళగుంద), విజయశేఖర్‌రావు (ఆదోని), జగన్‌మోహన్‌రెడ్డి (కౌతాళం), విజయలలిత (మద్దికెర), జీ వెంకటేశ్వరరెడ్డి (గూడురు), విశ్వమోహన్ (డోన్), సీవీ కొండయ్య (ప్యాపిలి), ఏ శ్రీనివాసరావు (వెల్దుర్తి), దశరథరామయ్య (మిడుతూరు), జీవీ సుబ్బరాజు (కొలిమిగుండ్ల), గోపిక్రిష్ణ (డ్వామా), కే సావిత్రీ (గోస్పాడు) ఉన్నారు. అలాగే ఈఓఆర్‌డీల్లో వీరరాజు (తుగ్గలి), వెంకటరమణప్ప (పెద్దకడుబూరు), కే వరలక్ష్మి (కౌతాళం), మోహన్‌కుమార్ (కృష్ణగిరి), శివమల్లేశ్వరప్ప (సంజామల), ఎం కవిత (ఆత్మకూరు), ఎస్ భాగ్యలక్ష్మి (రుద్రవరం), వై పుల్లయ్య (పగిడ్యాల), సోలమన్ (శిరివెళ్ల), సుమిత్రమ్మ (పాములపాడు), మణిమంజరి (జూపాడుబంగ్లా) ఉన్నారు. వీరికి ఎంపీడీఓలుగా పదోన్నతులు లభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

పదోన్నతులపై ప్రత్యేక దృష్టి

పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగుల పదోన్నతులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 2020 జనవరిలో జిల్లాలో అర్హులైన ఏఓ, ఈఓఆర్‌డీలు మొత్తం 26 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించింది. అలాగే అదే ఏడాది అక్టోబర్ నెలలో డివిజినల్ కేంద్రాల్లో డీఎల్‌డీఓ పోస్టులను క్రియేట్ చేసి అర్హులైన ఎంపీడీఓలకు డీఎల్‌డీఓగా పదోన్నతులు కల్పించింది. రెండున్నర దశాబ్దాలుగా పదోన్నతుల కోసం వివిధ రూపాల్లో ఉద్యమాలు చేసిన ఎంపీడీఓలకు ఊరట లభించింది. పదోన్నతులకు సంబంధించి 2022 ఆగస్టు 11న జీఓ విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీఓతో జిల్లాలో 14 మంది సీనియర్ ఎంపీడీఓలకు పదోన్నతులు లభించాయి.

వివరాలు పంపాం



పదోన్నతులకు సంబంధించి వివిధ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న అర్హులైన ఏఓల వివరాలను కమిషనరేట్ కోరిన ఫార్మెట్‌లో పంపించాం. అలాగే ఈఓఆర్‌డీల వివరాలను జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి పంపించారు. అర్హులైన ఏఓ, ఈఓఆర్‌డీలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు లభించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన పనులు కమిషనరేట్‌లో వేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

– జీ నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912



ఎం. ఉమాపతి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ, కర్నూలు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ అంతరాయ సమస్యలు ఏర్పడితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి వినియోగదారులను కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్‌కు సబంధించి ఏ సమస్య ఏర్పడినా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 1912 తెచ్చినట్లు వెల్లడించారు. ఈ నంబరుకు ఫిర్యాదు చేసి సమస్య చెప్పి, రిజిస్ట్రేషన్ చేసుకొని నంబర్ పొందవచ్చని, దీంతో ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆన్‌లైన్‌లో కింది నుంచి పై స్థాయి అధికారుల వరకు పరిశీలన ఉంటుందని చెప్పారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా ఒకరి ఇంటికే కరెంటు పోతే.. ఇంట్లో సాంకేతిక సమస్య, ఫ్యూజ్ కాలిపోవడం లాంటి సమస్యలు ఏర్పడితే ప్రైవేటు ఎలక్ట్రీషియన్లతో చేయించుకోవాలని, అలా కాకుండా కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వీధి మొత్తం, ఆ ప్రాంతం అంతా కరెంటు సమస్య ఏర్పడితే తమ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని కోరారు. వీధి లైట్ల సమస్య ఉంటే మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

20 ఏళ్ల కల.. నెరవేరుతున్న వేళ

- డోన్‌లో ఫోర్ కోర్టు నిర్మాణానికి రూ.23.50 కోట్లు మంజూరు
- హామీని నిలబెట్టుకున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన
- హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



ప్రభుత్వం రూపొందించిన ఫోర్ కోర్టు నూతన భవన సముదాయం (నమూనా)



తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన సబ్‌కోర్టు

డోన్: న్యాయవాదుల 20 ఏళ్ల కల త్వరలో సాకారం కాబోతుంది. పోలీసు డివిజన్ కేంద్రమైన డోన్‌లో ప్రభుత్వం ఫోర్ కోర్టు (కోర్టుల సముదాయం) ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా న్యాయవాదులు ధర్నాలు, ఆందోళనలు నిరాహారదీక్షలు చేశారు. ఈ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సీఎంగా, కేఈ కృష్ణమూర్తి డిప్యూటీ సీఎం పదవులు అలంకరించినా న్యాయవాదులకు న్యాయం జరుగలేదు. వారి డిమాండ్ కలగానే మిగిలిపోయింది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి ఆర్థిక శాఖ మంత్రిగా కొనసాగుతున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్‌ను ఆదర్శంగా నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్న క్రమంలో న్యాయవాదులకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఏడాది క్రితం డోన్‌కు సబ్‌కోర్టు కూడా మంజూరైంది. గతంలో సబ్‌కోర్టు లేకపోవడంతో వందల సంఖ్యలో సివిల్, క్రిమినల్ కేసుల కోసం కర్నూలుకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం 302, మర్డర్ కేసు, దకాయిట్ పెద్ద కేసులకు తప్ప మిగిలిన అన్ని కేసులు సబ్‌కోర్టులోనే విచారణ జరుపుతుండటంతో కక్షిదారులకు ఆర్థిక భారం తగ్గడం, న్యాయవాదులకు సమయం కలిసివచ్చింది. ప్రస్తుతం సబ్ కోర్టును తాత్కాలికంగా స్థానిక పాదుపు భవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే కోర్టు ఆవరణలో ఫోర్ కోర్టు (నాలుగు కోర్టుల సముదాయం) భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.23.50 కోట్లను మంజూరు చేసింది. ఐదు రోజుల క్రితం నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ నిధులతో సబ్‌కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులను నాలుగు అంతస్తుల భవనాల్లో అత్యాధునిక వసతులతో నిర్మించనున్నారు. దీంతో పలు కేసుల్లో కోర్టులను ఆశ్రయించే కక్షిదారులతో పాటు కేసులు వాదించే న్యాయవాదులకు సైతం సౌకర్యవంతంగా ఉండనుంది. న్యాయవాదుల దశాబ్దాల కల నెరవేరుతుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

హామీ ఇచ్చారు .. నెరవేర్చారు



ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేయించారు. సబ్ కోర్టు ఏర్పాటుతో పాటు ఫోర్ కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి న్యాయవాదులకు ఇచ్చిన హామీని కూడా నెరవేర్చారు.

– భాస్కర్ నాయుడు, సీనియర్ న్యాయవాది, డోన్

సీఎంకు ఎవరూ సరిలేరు



ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎవ్వరూ సాటిరారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత ఆయనకు దక్కింది. సీఎం బాటలోనే ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన కూడా నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగుతోంది.

– హరి మురళీధర్‌రావ్, సీనియర్ న్యాయవాది, డోన్

న్యాయవాదులకు మేలు చేశారు



న్యాయవాదుల జీవనాధారమైన వృత్తిని కొనసాగించేందుకు మార్గం మరింత సుగమమైంది. సబ్ కోర్టు ఏర్పాటుతో కర్నూలుకు వెళ్లాల్సిన అవసరం లేదు. సబ్‌కోర్టుతో పాటు మిగిలిన మూడు కోర్టుల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.23.50 కోట్లను మంజూరు చేయడం విశేషం. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డితోనే న్యాయవాదులకు మేలు జరిగింది.

– రేగటి రాజశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, డోన్

31లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

క్లుప్తంగా

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ ప్రతిపాదనల మేరకు 2016లో డిగ్రీ అడ్మిషన్స్ పొంది కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో చదివి ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు ఈ నెల 31వ తేదీలోపు ఫీజులు చెల్లించాలని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సెమిస్టర్ నుంచి ఆరో సెమిస్టర్ వరకు ఏ సెమిస్టర్‌లో ఫెయినా పరీక్షలు రాసుకునేందుకు వర్సిటీ అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కాలేజీలోని పరీక్షల విభాగాన్ని సంప్రదించాలన్నారు.

సంతానం కలగలేదని..

- మహిళ బలవన్మరణం

దేవనకొండ: పెళ్లయి 15 ఏళ్లు అయినా సంతానం కలగలేదని మనస్తాపం చెంది ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం దేవనకొండలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ భూపాలుడు తెలిపిన వివరాల మేరకు.. దేవనకొండ ఎస్సీ కాలనీకి చెందిన డానియల్, దేవమ్మ కుమార్తె సుగంధంను పత్తికొండ మండలం హోసూరు గ్రామానికి చెందిన హరిజన రంగస్వామికి ఇచ్చి వివాహం చేశారు. భార్యాభర్తల మధ్య గొడవ తలెత్తి ఆమె గత కొంతకాలంగా పుట్టినింట్లో ఉంటోంది. వివాహమై 15 ఏళ్లు అయినా సంతానం కలగకపోవడంతో మనస్తాపం చెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుగంధం(35) ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించేలోపే ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ కారుణ్య నియామకాల జాబితా సిద్ధం

కర్నూలు(రాజ్‌విహార్): ఆర్టీసీలో కారుణ్య నియామకాల కింద భర్తీ చేస్తున్న పోస్టులు, ఎంపికైన అభ్యర్థుల వివరాలతో జాబితాను సిద్ధం చేసినట్లు జిల్లా అధికారి టి. వెంకటరామం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ శాఖలో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లుగా, 21 మంది కానిస్టేబుళ్లుగా, ఒకరు డ్రైవర్‌గా, 19 మంది అసిస్టెంట్ శ్రామికులుగా ఎంపికైనట్లు చెప్పారు. వీరి వివరాలను తన కార్యాలయంతో పాటు అన్ని డిపో మేనేజర్ల కార్యాలయాల్లో ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు త్వరలో మెడికల్ పరీక్షలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు పర్సనల్ ఆఫీసర్ సెల్ 9959225792 నంబరును సంప్రదించవచ్చని వెల్లడించారు.

ఎస్‌ఎంఎస్ పంపకపోతే బ్యాంకుదే బాధ్యత

- వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్
- ఏటీఎం హ్యాక్ కేసులో బాధితుడికి ఊరట
- రూ.4.21 లక్షలు వడ్డీతో ఇవ్వాలని ఎస్‌బీఐకి ఆదేశం

కర్నూలు (లీగల్) : ఏటీఎం లావాదేవీలకు సంబంధించిన ఎస్‌ఎంఎస్‌లను ఖాతాదారునికి పంపాల్సిన బాధ్యత బ్యాంకుదేనని, అలా సమాచారం పంపకపోతే ఖాతాదారునికి జరిగే ఆర్థిక నష్టానికి బ్యాంకుదే బాధ్యత అని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ స్పష్టం చేసింది. పలు కేసుల్లో బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్ కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ శుక్రవారం తీర్పునిచ్చింది. కర్నూలు జిల్లా హాలహర్వికి చెందిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇ.ఈరన్న గతంలో అనంతపురం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సమయంలో అక్కడి ఎస్‌బీఐ కనేకల్ బ్రాంచ్‌లో ఖాతా తెరిచారు. 2018 నవంబర్ 28న కొత్త ఏటీఎం కార్డు కోసం ఎస్‌బీఐ బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామంటూ ఓ వ్యక్తి కాల్ చేసి కార్డు నెంబర్, ఓటీపీ అడిగి తెలుసుకున్నారు. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 5వ తేదీ మధ్య వారం రోజుల వ్యవధిలో ఏటీఎం కార్డును హ్యాక్ చేసి 35 పర్యాయాలు రూ.4.21 లక్షలను వేర్వేరు ఖాతాలకు బదిలీ చేసుకున్నారు. అయితే ఈ లావాదేవీలకు సంబంధించిన ఒక్క ఎస్‌ఎంఎస్ కూడా డాక్టర్ ఈరన్నకు రాలేదు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన డాక్టర్ ఈరన్న ఎస్‌ఎంఎస్‌లు ఎందుకు పంపలేదంటూ బ్యాంకు అధికారులను సంప్రదించినా స్పందన లేకపోవడంతో కమిషన్‌లో కేసు దాఖలు చేశారు. దీంతో విచారణ చేపట్టిన కమిషన్ బెంచ్ లావాదేవీలకు సంబంధించిన ఎస్‌ఎంఎస్‌లు పంపుతామంటూ ఖాతాదారుని నుంచి రుసుము వసూలు చేస్తూ మెసేజ్‌లు పంపకపోవడం సేవాలోపమని కమిషన్ తేల్చి చెప్పింది. ఏటీఎం కార్డును హ్యాక్ చేసి ఖాతాదారుని ఖాతా నుంచి రూ.4.21ను 35 లావాదేవీల ద్వారా తీసుకున్న కేసులో ఒక్క ఎస్‌ఎంఎస్ కూడా పంపకుండా బ్యాంకు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొంది. ఇందుకు బాధ్యత వహిస్తూ రూ.4.21 లక్షలను 6 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అనంతపురం జిల్లా కనేకల్ బ్రాంచ్ మేనేజర్‌ను ఆదేశించింది. అలాగే పరిహారంగా రూ.10 వేలు, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు చెల్లించాలని తీర్పులో పేర్కొంది.

లిఫ్ట్ నుంచి పడి గౌండ మృతి

కర్నూలు : స్థానిక బంగారుపేటకు చెందిన సురేంద్ర (21) లిఫ్ట్‌లో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. సురేంద్ర స్నేహితుడి బర్త్‌డే వేడుకల కోసం ఎస్టీబీసీ కాలేజ్ సమీపంలోని ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకుని సంబరాలు జరుపుకున్నారు. మూడో అంతస్తు నుంచి కిందికి దిగే సమయంలో లిఫ్ట్‌లో నుంచి అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందాడు. తల్లి రామాంజనమ్మ ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ ఇంట్లో చోరీ...

కర్నూలు శివారులోని నంద్యాల చెక్‌పోస్టు వద్ద సింధూ ఎస్టేట్ కాలనీలో నివాసముంటున్న డాక్టర్ రుక్మిణమ్మ ఇంట్లో జరిగిన చోరీ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. రుక్మిణమ్మ కూతురి వివాహ వేడుకకు వచ్చిన బంధువు రాములమ్మ బ్యాగులోంచి 12వ తేదీ రూ.రెండున్నర లక్షలు విలువ చేసే బంగారు గొలుసు మాయమయ్యింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడవ పట్టణ పోలీసులు తెలిపారు.

19 ఏళ్ల పోరాటం ఫలించింది

- ప్రభుత్వ పింఛన్ మంజూరైయింది



లేపాక్షమ్మ (ఫైల్)

ఆలూరు: భర్త ఉద్యోగ విరమణ పొంది అనారోగ్యంతో మృతి చెందారు. భర్తకు రావాల్సిన అరియర్స్, పింఛన్ కోసం ఓ మహిళ సుమారు 19 ఏళ్లు పోరాటం చేసి ఎట్టకేలకు విజయం సాధించారు. ఆలూరు పట్టణానికి చెందిన హరిజన నీలకంఠ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ 2004లో ఉద్యోగ విరమణ పొందారు. అనారోగ్యంతో ఆయన 2006 మృతి చెందారు. వివిధ కారణాలతో ఉద్యోగ విరమణ అనంతరం ఆయనకు అరియర్స్ ఇవ్వలేదు. అలాగే పింఛన్ కూడా మంజూరు చేయలేదు. తనకు ఎలాంటి జీవనాధారం లేదని, తన భర్తకు రావాల్సిన ఆరియర్స్, పింఛన్ మంజూరు చేయాలని లేపాక్షమ్మ.. ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. గత ప్రభుత్వం ఈమె విన్నపాన్ని పట్టించుకోలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈమె కష్టాన్ని అర్థం చేసుకుని ఆరియర్స్ రూ.15,65317 బ్యాంకు ఖాతాలోకి ఇటీవల జమ చేసింది. అలాగే ప్రతి నెలా రూ. 13,540 పింఛన్ వచ్చే విధంగా ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో లేపాక్షమ్మ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సబ్సిడీపై చిరుధాన్యం విత్తనాల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తోంది. 2023వ సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే మినుము, పెసర, కందులు తదితరాల ధరలు, సబ్సిడీలను ఖరారు చేసింది. సబ్సిడీపై కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, అండుకొర్రల సర్టిఫైడ్ సీడ్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- కొర్రల్లో ఎస్ఐఏ-3156 ఇతర రకాల కిలో పూర్తి ధర రూ.67.50 ఉండగా.. సబ్సిడీ రూ.33.75 ఉంటుంది.
- సామలు, ఆరికలు, ఊదలు, అండుకొర్రలు, రాగులు కిలో పూర్తి ధర రూ.69.50 ఉండగా.. 50 శాతం సబ్సిడీ ఉంటుంది.
- పప్పు దినుసులైన మినుములు(పీయు-31, ఎల్‌బీజీ-752, ఐపీయు 2.43, టీబీజీ -104 రకాలు) కిలో పూర్తి ధర రూ.117.50 ఉండగా.. సబ్సిడీ రూ.35.25 ఉంటుంది.
- పెసర (ఐపీఎం 2.14 రకంతో పాటు ఇతర రకాలు) కిలో పూర్తి ధర రూ.117.50 ఉండగా.. సబ్సిడీ రూ.35.25 ఉంటుంది.
- కందులు ఎల్ఆర్‌జీ-52, ఐసీపీఎల్-87119 ఇతర రకాలు కిలో ధర రూ.111.40 ఉండగా.. సబ్సిడీ రూ.33.42 ఉంటుంది.
- కందుల్లోనే ఐసీపీహెచ్-2740 రకం (హైబ్రిడ్) కిలో ధర రూ.128 ఉండగా.. సబ్సిడీ రూ.38.40 ఉంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3017	7867
పొద్దుతిరుగుడు	2169	3519
ఆముదం	4689	5259
వాము	5200	26500
ఎండుమిర్చి	6006	17609
శనగలు	3648	3648
కందులు	4150	8714
మొక్కజొన్న	1330	1801
సోయా చిక్కుడు	3000	3000

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి

పాములపాడు: మండల కేంద్రమైన పాములపాడులో విద్యుదాఘాతంతో ఓ టిప్పర్ డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. మిట్టకందాల గ్రామానికి చెందిన బాలరాజు(28) స్థానిక టీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని కంపెనీ క్యాంప్‌లో బోరు పైపు వద్ద కాళ్లు కడుకునేందుకు వెళ్లాడు. అప్పటికే పైపు ద్వారా విద్యుత్ ప్రసరిస్తుండటంతో విద్యుదాఘాతానికి గురై విలవిలాలాడు. పక్కనే ఉన్న మరో డ్రైవర్ రవి గమనించి బోరు స్విచ్ ఆఫ్ చేసేలోగా బాలరాజు మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ప్రమాదానికి రెండు గంటల ముందు అక్కడే లేగదూడ విద్యుత్‌దాఘాతంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య స్వరూపరాణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలిసినా సంఘటన స్థలానికి కంపెనీ ప్రతినిధులు ఎవరూ రాకపోవడంతో మృతుడి బంధువులు కేజీ రోడ్డుపై ధర్నా చేపట్టారు. టీఎస్ఆర్ కంపెనీ, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు అర గంట పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ అశోక్ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చచెప్పి ధర్నా విరమింపజేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.



బాలరాజు మృత దేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

వ్యక్తిగత దూషణలకే లోకేష్ పాదయాత్ర

- జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కేవలం వ్యక్తిగత దూషణలకే పరిమితమైందని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం జెడ్పీలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరి హయాంలో జరగనంత అభివృద్ధి ప్రస్తుతం డోన్ నియోజకవర్గంలో జరుగుతోందని, తాము అధికారంలో ఉన్నప్పుడే డోన్ అభివృద్ధి జరిగిందని లోకేష్ చెప్పిన మాటలు విని ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి రాజకీయ అనుభవం అంత వయస్సు లేని లోకేష్ వారిని ఎలాంటి ఆధారాలు లేకుండా వ్యక్తిగతంగా దూషించడం ఆయన రాజకీయ పరిణతికి నిదర్శనమన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం, స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలను విమర్శించడమే పనిగా ఆయన పాదయాత్ర సాగిందన్నారు. ప్రతిపక్ష నేతగా సద్విమర్శలు చేస్తే ఎవరైనా స్వాగతిస్తారని, తన పాదయాత్రలో ఎలాంటి ప్రజా స్పందన లేకపోవడంతో తమ పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తలతోనే ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించుకున్నారని ఎద్దేవా చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాదయాత్రలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ప్రజల కష్టాలను కళ్లారా చూసిన వీరు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేయడం వల్ల నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద, మధ్య తరగతి ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన అనేక సమస్యలకు అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్ పరిష్కారం చూపుతున్నారన్నారు. విలేకరుల సమావేశంలో కర్నూలు, గూడూరు, జూపాడుబంగ్లా జెడ్పీటీసీలు ఎస్ ప్రసన్నకుమార్, పీ మౌలాలి, పోచా జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

- డీపీఓ టీ నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 30వ తేదీన పత్తికొండ పర్యటన సందర్భంగా ఎక్కడా పారిశుధ్య సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. హెలిప్యాడ్ ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి ప్రసంగించనున్న బహిరంగ సభ ప్రాంగణం వరకు ఆయా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేకంగా మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఒకటో బృందం హెలిప్యాడ్, వడ్డెవారికట్ట, తేరుబజార్, ఎంపీడీఓ కార్యాలయం మిట్ట వరకు పర్యవేక్షిస్తుందన్నారు. రెండో బృందం ఎంపీడీఓ కార్యాలయం మిట్ట నుంచి కోర్టు, గ్రామ పంచాయతీ కార్యాలయం, సవారమ్మ దేవాలయం వరకు, మూడో బృందం సభా వేదిక వద్ద ఎలాంటి అపరిశుభ్ర వాతావరణం లేకుండా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ బృందాలను పర్యవేక్షించేందుకు ఒక డీఎల్‌పీఓ, ఒక ఈఓఆర్‌డీ, 10 మంది పంచాయతీ కార్యదర్శులు, ఆరుగురు గ్రేడ్ -5 కార్యదర్శులు, ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉంటారన్నారు. ఆయా ప్రాంతాల్లో మొత్తం 88 మంది వర్కర్లను కేటాయించామని, రిజర్వులో మరో 12 మంది ఉంటారన్నారని డీపీఓ చెప్పారు.

సెల్‌ఫోన్ మాయలో పడొద్దు

- పుస్తకమే మంచి నేస్తం
- రచయిత మంచికంటి వెంకటేశ్వర రెడ్డి



మోటార్‌సైకిల్ యాత్ర చేపట్టిన మంచికంటికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

వెల్దుర్తి: విద్యార్థులు, యువత సెల్‌ఫోన్ మాయలో పడొద్దని, పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని పొందవచ్చని ప్రముఖ రచయిత, సామాజిక వేత్త, ఉపాధ్యాయుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమం పేరుతో ఈయన ఈనెల 19న ఒంగోలులో మోటార్ సైకిల్ యాత్ర చేపట్టారు అనంతపురం మీదుగా శుక్రవారం వెల్దుర్తి చేరుకున్నారు. మాట్లాడుతూ పిల్లలు చదవడం పూర్తిగా మానేసి సెల్‌ఫోన్ల మాయలో పడ్డారన్నారు. దీంతో వారి తెలివి అథఃపాతాళానికి చేరుతోందన్నారు. వారి శక్తిని బయటకు తీసే సాధనం పుస్తకమేనన్నారు. పిల్లలను పుస్తకాల వైపు మళ్లించాలని తల్లిదండ్రులను కోరుతున్నట్లు తెలిపారు. మంచికంటికి గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధి హరిసింహనాయుడు, జగన్నాథం, రామాంజనేయులు స్వాగతం పలికారు.

కత్తులతో యువకుల హల్‌చల్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ఇద్దరు యువకులు శుక్రవారం రాత్రి మద్యం మత్తులో పరస్పరం కత్తులతో దాడి చేసుకున్నారు. స్థానిక పక్కీర్‌పేట వీధికి చెందిన కొత్తూరు, మహబూబ్ స్నేహితులు. ఇద్దరు కలిసి రాత్రి మద్యం సేవించేందుకు స్థానిక చిన్న చెరువు కట్ట వద్దకు వెళ్లారు. మద్యం మత్తులో వ్యక్తిగత విషయాల కారణంగా ఇరువురు ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో వారి వద్ద ఉన్న కత్తులతో పరస్పరం దాడి చేసుకున్నారు. రక్తపుమడుగులో పడి ఉన్న ఇద్దరిని స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

వాక్ ఇన్ ఇంటర్వ్యూకు ఇద్దరు హాజరు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి శుక్రవారం నిర్వహించిన వాక్ ఇన్ ఇంటర్వ్యూకు కేవలం ఇద్దరు అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. మొత్తం 71 పోస్టులకు అధికారులు వాక్ ఇన్ ఇంటర్వ్యూకు పిలవగా గైనకాలజీ, పాథాలజీకి ఒక్కొక్కరు మాత్రమే వచ్చారు. దీంతో వారిని ఎంపిక చేసి డీఎంఈకి అధికారులు నివేదించారు. పీజీ ఫలితాలు వెలువడిన ఆరు నెలలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించడం, కేవలం ఒక రోజు ముందు పత్రికా ప్రకటన ఇవ్వడం వల్ల ఎక్కువ మంది అభ్యర్థులకు సమాచారం తెలిసి ఉండకపోవచ్చని పలువురు వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
OSSC అటానమస్ బోర్డు వారి Open School ద్వార SSC లేదా ఇంటర్ ఒకే సం॥లో పాస్ కావచ్చు. (ఇంటర్ అన్ని గ్రూపులు కలవు) వివరాలకు – 75692 64956 [L-635]

DMLT ADMISSIONS
DMLT (Lab Technician) - 2 years. Paramedical Course. Eligible: Any Inter. SEEDS COLLEGE, ATP. Cell: 9440255034, 8897761840. [A-745511]

PARAMEDICAL
B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1418]

REAL ESTATE
గణేష్‌నగర్‌లో 2BHK ఫ్లాట్ 45 లక్షలు & పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ దగ్గర 3BHK డూప్లెక్స్ హౌస్ & సాయికృష్ణ డిగ్రీ కాలేజ్ దగ్గర ఓపెన్ ప్లాట్ 23 లక్షలు సేల్ కలదు. 90145 80500 [L-798986]

PLOT FOR SALE
ఓర్వకల్లు-శకునాల సోలార్ పార్క్ ప్రక్కన, 30x40 (2.75 సెంట్లు) ప్లాటు కేవలం 3 లక్షలు మాత్రమే. కంతుల సౌకర్యం కలదు. సంప్ర: నితిక డెవలపర్స్, 98884 24222 [L-799018]
కర్నూలు-నంద్యాల రోడ్డు నన్నూరులో సర్కిల్ రోడ్డు అనుకొని 30x45, 50x45 సైజు గల కార్నర్ డెవలప్‌మెంట్స్‌తో ఓపెన్ ప్లాట్లు కలవు. సంప్ర: 93938 20555 [L-799280]
కర్నూలు నందికొట్కూరు రోడ్డు, గార్గేయపురం చెరువు ఎదురుగా గ్లోబల్ లేక్ వ్యూ వెంచర్ నందు 60x45 సైజు, పడమర, ఉత్తరం కార్నర్ ప్లాటు అమ్మబడును. 94405 92264, 94402 92787 [L-799281]

ప్లాట్లు, ప్లాట్లు, ప్లాట్లు ప్రకృతి రియల్ ఎస్టేట్ న్యూ వెంచర్ నందు ఓపెన్ ప్లాట్స్ కలవు. అతి తక్కువ ధరలకే అమ్మబడును. స్పాట్ రిజిస్ట్రేషన్. 100% టైటిల్ క్లియర్. సెల్: 94401 58901 [L-799001]

HOUSE FOR SALE
Kuda Approvalతో గణేష్ నగర్‌లో Padma's Residency అపార్ట్‌మెంట్‌లో 1,2,3 BHK Flats & పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ దగ్గరలో 77 య్యార్ల్ లో 3BHK హౌస్ & హాటిల్దిర్దు రోజి సూపర్ ల్యగ్జరీ హౌస్ అమ్మకమునకు కలవు. 90143 35313 [L-798987]

TO-LET
కర్నూలు బళ్ళారి రోడ్డు నందు స్కందాన్షి టవర్స్ సమీపాన 2000 Sqft, 3BHK గల హౌస్ నివాసానికి, ఆఫీస్‌కు, గోడౌన్‌కి కాని బాడుగకు ఇవ్వబడును. సంప్ర: 99489 19500 [L-799271]

SERVICES
ASTROLOGY
నేపాల్ రుద్రాక్ష మహా బండార్ అద్భుత శక్తులు, అనంత సంపదలకు ఏకముఖి నుండి బహుముఖాల అసలైన నేపాల్ రుద్రాక్షలు లభించును. మద్దూరు నగర్, కర్నూలు. సెల్: 70364 85686, 63024 30756 [L-637]

FOR SALE
మినీ సూపర్ మార్కెట్ రన్నింగ్‌లో వున్నది అమ్మబడును. కర్నూలు ధర్మపేట, దీపక్‌తేజ్ హాస్పిటల్ దగ్గర స్టాక్‌తో సహా (బిల్డింగ్ కాదు) అమ్మబడును. 91820 12969, 99124 44244 [L-799016]

WANTED
హోటల్ నిత్యశ్రీ టిఫిన్స్ నందు టీ, టిఫిన్ వెజ్ & నాన్‌వెజ్ కర్రీస్ చేయుటకు మాస్టర్స్ కావలెను.టిడిపి ఆఫీస్ దగ్గర గాయత్రి ఎస్టేట్స్, కర్నూలు. సెల్: 93989 36989 [L-799278]
కర్నూలు జిల్లాలో కొమ్మచెఱువు అంజనేయస్వామి గుడి దగ్గరలో ప్రముఖ మసురం ఫ్యాక్టరీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీ: 11500+ రూమ్, భోజనం. 95817 76921, 95817 76923 [L-799273]

Wanted Lady Teachers to teach all Subjects (EM) for Global E.M. School, Budhawarapeta, Kurnool. Preference to local teachers. 85559 26418 [L-799269]
కర్నూలు సిటీలో గల రెస్టారెంట్ నందు పనిచేయుటకు వెయిటర్స్, బాయ్స్, హౌస్ కీపింగ్ స్టాఫ్, క్లీనింగ్ స్టాఫ్ కావలెను. రూం+ భోజన సదుపాయం మరియు కర్నూలు టౌన్ నందు అపార్ట్‌మెంట్స్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. సంప్ర: 83419 57788 [L-799277]
Receptionist/లేడీ హెల్పర్స్ కావలెను. అర్హత: 10th/ANM, 10am-8pm శ్రీ సాయి బాలాజీ డెంటల్ క్లినిక్, రోడ్ నెం.4, వెంకటరమణ కాలనీ, కర్నూలు. సెల్: 98852 53819 [L-636]
కర్నూలు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల వారికి మా సంస్థలో పనిచేయుటకు 28 స్త్రీ/పు కావలెను. అర్హత: 10thడిగ్రీ, ITI డిప్లొమా (P/F) జీ: 13 వేలు+ కమీషన్ 6 వేలు+ బోనస్+ ఫ్రీ రూం. సెల్: 95502 50229 [L-799267]
టూ వీలర్ షోరూం నందు అనుభవం కల్గిన అకౌంటెంట్, టాలీ ఆపరేటర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, సంప్ర: R&M SUZUKI బంగారుపేట, కర్నూలు. సెల్: 87126 13148 [L-799276]
విజయ మహిళా మండలి, ఎమ్మిగనూరు నందు HIV/AIDS Programme నందు ANM పోస్ట్ ఖాళీగా వున్నది -1, విద్యార్హత: ANM/ GNM/ B.Sc Nursing ఇంటర్వ్యూ తేది: 29-05-23, Mail: vmmygrtiapsacs@gmail.com, Cell: 94405 54319, 96426 00595 [L-799279]
ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786357]
మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221302]

మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000/- వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర: 7989951063 [G-786358]
ప్రముఖ కంపెనీలో ఎర్రచందనం ఫామ్ ల్యాండ్స్ ప్రాజెక్ట్ మార్కెటింగ్ చేయుటకు లీడర్స్ కావలెను. మంచి కమీషన్, కార్ ఫండ్, హౌస్ ఫండ్, మంచి హోదా, ఇన్సెంటివ్స్ అలవెన్స్‌లు ఇవ్వబడును. మా ప్రాజెక్ట్స్ ప్రకాశం, నెల్లూరు జిల్లా దగ్గరలో. 8367587799 [G-78]
VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7995374999 [HA-208]
డైరెక్ట్ జాబ్ 18-50 సం.ల మహిళలు/మా కంపెనీ కొరకు వెంటనే కావలెను. ఉచిత వసతి+భోజనం+ జీతం: 16000-30000 వేల వరకు. స్పాట్ జాయినింగ్. ఫోన్: 8886733005. [H-781493]
ఫ్రాంచైజ్ ఆఫర్ (పెట్టుబడి లేదు) మార్కెటింగ్ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి మాత్రమే ఫ్రాంచైజ్ ఇవ్వబడును. Mega Group Man Power & Security. Cont : 7032610569, 7093125169. [NA-5635]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725